www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

TELANGANA RISING
CURE - PURE - RARE



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:11 TUESDAY ,MAY 19,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 11 మంగళవారం 19 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం
### హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి



హంసకలం వార్త మే 18

కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

- మిగతా2లో

## ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం




హంసకలం వార్త మే 18

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా,

- మిగతా2లో

## 'మన దేశం గురించి తెలియకనే ఆ విమర్శలు'..
### డచ్ ప్రధానికి భారత్ గట్టి కౌంటర్

హంసకలం వార్త మే 18

భారత్‌లో పత్రికా స్వేచ్ఛ, మైనారిటీల హక్కులపై డచ్ ప్రధానమంత్రి రోబ్ జెట్టన్ చేసిన వ్యాఖ్యలను విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. మన దేశ సామాజిక, ప్రజాస్వామ్య వ్యవస్థపై కనీస అవగాహన, తగిన సమాచారం లేకపోవడం వల్లే ఇలాంటి విమర్శలు చేశారని తిప్పికొట్టింది. ది హేగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి సిబి జార్జ్ మాట్లాడుతూ.. కేవలం

- మిగతా2లో



## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర

హంసకలం వార్త మే 18

ప్రపంచ దేశాలను అల్లకల్లోలంలోకి నెట్టడం అమెరికా నిత్యం చేస్తూనే ఉంటుంది.తన పట్టును కొనసాగించేందుకు అమెరికా చేయని పనులు లేవు. దానికి సలాం అనకుంటే ఆయా దేశాలను అతలాకుతలం చేస్తుంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు ఇలా విలవిల్లాడినవే. మనదేశంలోనూ వేలుపెట్టపోయి చేతులు కాల్చుకుందని చెబుతారు.తాజాగా పాక్‌లోనూ ఇలాంటి చర్యలకు దిగినట్లు తాజా వార్తలు రుజువు చేస్తున్నారు. పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య

- మిగతా2లో



## బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

హంసకలం వార్త మే 18

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలోకేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపు తున్న బీఆర్ఎస్ నేతల పై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు

- మిగతా2లో



## ఈపీసెట్ 2026 లో ఎంజేపి విద్యార్థుల హవా

హంసకలం వార్త మే 18

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్ -2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్, ఫార్మసీ మరియు ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు

- మిగతా2లో



## ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం మండిపడ్డ ఎమ్మెల్యే సబితా రెడ్డి



హంసకలం వార్త మే 18

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రా రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా బోంరాస్ పేట మండలంలోని తుంకిమెట్లలో ధాన్యం

- మిగతా2లో

## ఈ -గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

హంసకలం వార్త మే 18

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ -గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ

- మిగతా2లో



## బండి భగీరథ పై అదనపు సెక్షన్లు

హంసకలం వార్త మే 18

పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ

- మిగతా2లో





# కేరళం సిఎంగా సతీశన్ ప్రమాణం

-మొదటిపేజీ తరువాయి

20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పని చేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్ని ప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తు చేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు.వీరితో పాటు పోలీస్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఈపీసెట్ 2026లో ఎంజేపి విద్యార్థుల హవా

-మొదటిపేజీ తరువాయి

వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్ ), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి గారు, ఎం జె పి కార్యదర్శి బడుగు సైదులు గారు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# బండి భగీరథ పై అదనపు సెక్షన్లు

-మొదటిపేజీ తరువాయి

ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెల్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెల్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయ.

## ఇమ్రాన్ పదవీచ్యుతిలో అమెరికా పాత్ర

-మొదటిపేజీ తరువాయి

సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకు ముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని దక్షిణ- మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు. అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని అప్పుడే అమెరికా-పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు. ఇటీవల ఆయన పై హత్యాయత్నం కూడా జరిగిందని వార్తలు వచ్చాయి. మొత్తంగా అమెరికా తీరుతో ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు.

## 'మన దేశం గురించి తెలియకనే ఆ విమర్శలు'.. డచ్ ప్రధానికి భారత్ గట్టి కౌంటర్

-మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి ముందు రోబ్ జెట్టన్ భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో కేవలం పత్రికా స్వేచ్ఛతో పాటు మైనారిటీల హక్కులు ఒత్తిడిలో ఉన్నాయని నిరాధార ఆరోపణలు చేశారు. దీనిపై తమ ప్రభుత్వం ఆందోళన చెందుతోందని ఓ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఇలాంటి అంశాలను తాము క్రమం తప్పకుండా భారత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. డచ్ ప్రధాని వ్యాఖ్యలకు భారత్ తన ప్రజాస్వామ్య బలాన్ని తెలియజేసేలా గణాంకాలతో కూడిన కౌంటరిచ్చింది. భారత్ 140 కోట్ల జనాభాతో, 5,000 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన గొప్ప వైవిధ్యభరితమైన దేశమని జార్జ్ గుర్తుచేశారు. హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలు ఇక్కడే పుట్టాయని తెలిపారు. అన్ని మతాలు శతాబ్దాలుగా వర్ధిల్లుతున్నాయని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది ఓటర్లు పాల్గొనడమే భారత ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో మైనారిటీల జనాభా 11 శాతంగా ఉంటే ప్రస్తుతం అది 20 శాతానికి పైగా చేరిందని ఇది మన సమ్మిళితత్వానికి నిదర్శనమని జార్జ్ కౌంటర్ ఇచ్చారు. అయితే, మోదీతో భేటీ అనంతరం డచ్ ప్రధాని జెట్టన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇరు దేశాలూ ప్రజాస్వామ్యానికి, సుపరిపాలనకు ఎంతో ప్రాధాన్యం ఇస్తాయని పేర్కొనడం గమనార్హం.

## బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు.

## ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పరిస్థితి ధీనంగామారిందన్నారు. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వచ్చాయన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటో పె÷-దదె ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్మంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ , తదితరులు పాల్గొన్నారు.

## ఈ -గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్‌లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియ జేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానం పై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, షీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లతో రోడ్డుపై కవాతు చేసిన వరంగల్ పోలీసులు

-అనంతరం తహశీల్దార్ ముందు బైండోవర్

హంసకలం వార్త

శాంతిభద్రతల పరిరక్షణ కోసం వరంగల్ పోలీసులు చేపట్టిన వినూత్న చర్య చర్చనీ యాంశమైంది. నగరంలోని రౌడీషీటర్లను రోడ్డుపై నడిపిస్తూ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లిన పోలీసులు, అనంతరం వారిని బైండోవర్ చేయించారు. ఈ కార్యక్రమం వరంగల్ సబ్‌డివిజన్ పరిధిలో జరిగింది. అజాం జాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నుంచి ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం వరకు రౌడీషీటర్లను నడిపిస్తూ తీసుకెళ్లారు. మండుటెండలో జరిగిన ఈ కవాతులో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ముందు పోలీసులు, వెనుక పోలీస్ జీపులు ఉండగా, మధ్యలో రౌడీషీటర్లు నడుస్తూ వెళ్లడం స్థానిక ప్రజల్లో ఆసక్తి రేకెత్తించింది.



ఈ కార్యక్రమానికి సీఐ రమేష్ నేతృత్వం వహించగా,పలువురు ఎస్ఐలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ ఎదుట రౌడీషీటర్లను హాజరుపరచి బైండోవర్ ప్రక్రియ నిర్వహించారు.
భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యక లాపాలకు పాల్పడబోమని వారితో హామీలు తీసుకున్నట్లు సమాచారం. నేరస్తుల్లో భయం కలిగించేలా, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేలా ఈ చర్య చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. వరంగల్ నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. పోలీసుల ఈ చర్య ప్రస్తుతం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. కొందరు ప్రజలు పోలీసుల కఠిన వైఖరిని స్వాగతిస్తుండగా, మరికొందరు ఇది హెచ్చరికాత్మక చర్యగా అభిప్రాయ పడుతున్నారు.

# ధాన్యం కొనుగోలులో బాధ్యత మరిచిన కేంద్ర ప్రభుత్వం

-ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందవద్దు

-రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హంసకలం వార్త



ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం బాధ్యత మరిచిందని తప్పు కేంద్రం వద్ద పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో ధాన్యం కేంద్రాన్ని మంత్రి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు జరుగుతున్న తీరును, రైతులకు డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతున్న పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా మద్దతు ధర ప్రకటించి కొనుగోలు విషయాన్ని పట్టించుకోవడంలేదని మంత్రి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో గడచిన మూడు పంటల ధాన్యాన్ని రైతుల వద్ద సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్ల వద్ద నిల్వ చేసిందని మంత్రి వివరించారు. ఎఫ్ సి ఐ ద్వారా బియ్యం సేకరణ చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత మరిచి బియ్యం సేకరించక పోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లులో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు పేరుకు పోయాయని మంత్రి తెలిపారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని పరిస్థితిని వివరించి ఎఫ్ సి ఐ ద్వారా బియ్యం సేకరణ చేయించాల్సిన విషయం మరిచి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. దేశ ప్రధాని ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక మాట మాట్లాడలేదని మంత్రి ఆరోపించారు. బాధ్యతగా రైతుల వద్ద నుండి రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండగా బాధ్యత లేని బిజెపి నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రైతులెవరు ఆందోళన పడవద్దని రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. కొనుగోలు పూర్తయిన తర్వాత మిల్లర్ల నుండి వచ్చే సమస్యలకు రైతులను బాధ్యులను చేయకుండా అధికారులు బాధ్యత తీసుకొని ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం దించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. మిల్లర్లు ధాన్యం ఏ బి గ్రేడ్ విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ఇబ్బందులు పెడితే రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రోడ్డు పనులు పరిశీలించిన మంత్రి అడ్లూరి ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామం నుండి పెగడపల్లి మండలం కీచులాటపల్లి వరకు 8 కిలోమీటర్ల దూరం నిర్మిస్తున్న నూతన రోడ్డు పనులను మంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు. రూ. 11.21 కోట్లతో నిర్మిస్తున్న నూతన రోడ్డు ద్వారా ధర్మారం పెగడపల్లి మండలాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. నూతన రోడ్డుతో భూముల ధరలు సైతం పెరుగుతాయని మంత్రి అడ్డూరి తెలిపారు. రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించి సహకరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ రైతులను కోరారు.

# ఉపాధి హామీ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి





-గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకం

-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

హంసకలం వార్త

మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. గ్రామ పరిధిలో చేపడుతున్న చెరువు పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్ పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వేతనాలు, పని పరిస్థితులు, తాగునీరు తదితర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. గ్రామం నుంచి సుమారు 100 మంది ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పనులకు హాజరై పనులు ప్రారంభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., గ్రామాభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందన్నారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరై ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను తగ్గించడంలో ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, కూలీలు పనులకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఆదాయాన్ని పెంచు కోవాలని కోరారు. చెరువుల పూడిక తీత పనులు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, ఈ పనుల ద్వారా చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడి రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పూడిక తీత వల్ల వ్యవసాయ భూముల సారవంతత కూడా పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది బలాన్నిస్తుందని చెప్పారు. ఉపాధి హామీ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనుల అమలులో పారదర్శకత ఉండాలని, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామాల్లో చేప డుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణా లను మెరుగుపరచడమే లక్ష్యంగా కొన సాగుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబా నికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ నేతల మాటలు అబద్ధలైనా నమ్మేస్తాం ఎలా



హంసకలం వార్త

రాజకీయ నేతలు చెప్పే మాటలు, ఇచ్చే హామీలు అబద్ధం అని తెలిసినా ఈజీగా నమ్మేస్తాం. రాజకీయాల్లో ఇది చాలా సాధారణమైనది. కానీ, చాలా లోతైన మానసిక, సామాజిక ప్రక్రియతో ముడిపడి వుంటుంది. ఓటరు రాజకీయ నేతలను నమ్మడానికి అనేక కారణాలు కనిపిస్తాయి. అందులో ప్రధానంగా 'ఆశ' అనేది మనిషిని నమ్మిస్తుంది. ప్రజలు ఎక్కువగా సమస్యల మధ్య జీవిస్తుంటారు. ఉద్యోగం,రైతు సమస్యలు,ధరలు,విద్య,ఆరోగ్యం వంటి సమస్యలతో పోరాటం చేస్తూ ఉంటారు. ఈ సమయంలో ఒక నాయకుడు"ఇది చేస్తాం,అది ఇస్తాం"అంటే అది కేవలం హామీ కాదు,ఆశలా కనిపిస్తుంది. ఆశ ఉన్నప్పుడు మనిషి సందేహం కంటే నమ్మకానికే దగ్గరవుతాడు. ఇక 'అబద్ధం వెంటనే అబద్ధంలా కనిపించదు'.ఎన్నికల హామీలు సాధారణంగా భవిష్యత్తు గురించి ఉంటాయి.రెండు లక్షల ఉద్యోగాలు, ఉచితపథకాలు, అభివృద్ధి, పింఛన్లు, ఇవి వెంటనే పరీక్షించలేం.కాలం గడిచే వరకు అవి సాధ్యమే అనిపిస్తాయి. అమలు కాకపోయినా నాయకులు కోటి కారణాలు చెబుతారు."కేంద్రం సహకరించలేదు, గత ప్రభుత్వం అప్పులు చేసింది, కోర్టు అడ్డుకుంది, ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉందని ఈజీగా చెప్పేస్తారు.అప్పుడు హామీ పూర్తిగా అబద్ధంగా కాకుండా"పరిస్థితుల వల్ల ఆగిపోయింది"అనే భావన ఆటోమెటిక్ వస్తుంది. అంతేకాదు, వ్యక్తిపై భావోద్వేగ అనుబంధం ఎక్కువ వుంటుంది. చాలామంది పార్టీ కంటే నాయకుడిని నమ్ముతారు.కులం,ప్రాంతం,మతం, ఉద్యమం,వ్యక్తిత్వం ఇవి కలిసి ఒక భావోద్వేగ బంధాన్ని సృష్టిస్తాయి. అప్పుడు నాయకుడి తప్పును కూడా "ఇంకో అవకాశం ఇస్తే చేస్తాడులే" అని భావిస్తారు.ఓటర్లు కూడా దీనికి బాగా కనెక్ట్ అయ్యి ఉంటారు. ప్రజలు కూడా తమ నమ్మకాన్ని కాపాడుకోవాలనుకుంటారు. మనిషి ఒకరిని బలంగా నమ్మి ఓటు వేసిన తర్వాత,అతడు మోసం చేశాడని అంగీకరించడం కష్టంగా ఉంటుంది. ఎందుకంటే అది "నేను తప్పు చేశాను"అని ఒప్పుకోవడం లాంటిది.అందుకే చాలామంది నాయకుడిని సమర్థించే కొత్త కారణాలు వెతుకుతారు.హామీల అమలు విషయంలో తాజా రాజకీయ ప్రచారం నిజాన్ని మసకబారుస్తుంది.సోషల్ మీడియా,పార్టీ ప్రచారం,టీవీచర్చలు ఇవన్నీ కలిసి ఒక కథనాన్ని తయారు చేస్తాయి.అమలు కాని హామీలకన్నా,కొత్త హామీలు, ప్రత్యర్థుల తప్పులు ఎక్కువగా వినిపిస్తాయి.అప్పుడు ప్రజల దృష్టి దాని నుండి మళ్లిపోతుంది.దీనికి తోడు ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు బలహీనంగా ఉంటే "వీళ్ళే ఇలా ఉన్నారు,వాళ్లు వస్తే ఇంకా చెడ్డగా ఉంటుంది" అనే భావన కూడా బాగా పనిచేస్తుంది.అప్పుడు ప్రజలు అసంతృప్తిగా ఉన్నా అదే నాయకుడిని మళ్లీ ఎంచుకునే అవకాశం తప్పనిసరి అవుతుంది. అందుకే రాజకీయాల్లో అబద్ధపు హామీలు చాలా సార్లు పూర్తిగా "అబద్ధం"గా మిగలవు.అవి ఆశ, భావోద్వేగం,ప్రచారం,పరిస్థితుల వివరణల మధ్య మళ్లీ "సాధ్యమైన మాటలు"గా మారిపోతుంటాయి.

-ఆలోచించే ఓటరుగా ఉండాలి

అందుకే ప్రజలు,ముఖ్యంగా ఓటు హక్కు ఉన్న ఓటర్లు ఏలా ఉంటే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది.ఆశ,భావోద్వేగం,ఉచిత హామీల వెంట పడకుండా నాయకుడి గత రికార్డు,పనితీరు, విధానాలు చూడాలి."ఏం చేస్తానన్నారు,ఏం చేశారు" అని లెక్క అడిగే ధైర్యం ఉండాలి. సమాచారం ఉన్న ఓటరుగా ఉండాలి.సోషల్ మీడియా ప్రచారం, పుకార్లు కాకుండా మేనిఫెస్టో చదవాలి.అభ్యర్థి నేర చరిత్ర, ఆస్తులు,విద్యార్హతలు తెలుసుకోవాలి.ఓటు వేసే ముందు 10 నిమిషాలు రీసెర్చ్ చేస్తే చాలు.సమస్యల కోసం ఓటు వేయాలి,కులం,మతం కోసం కాదు. నీకు ఉద్యోగం కావాలా,నీళ్లు కావాలా,రోడ్లు కావాలా? ఆ సమస్యను పరిష్కరిస్తానని చెప్పే వాళ్లకే ఓటు వేయాలి.కులం, ప్రాంతం,మతం పేరుతో విడిపోతే నాయకుడికి లాభం,ప్రజలకు నష్టం.

-జవాబుదారీతనం అడిగే ఓటరుగా ఉండాలి

ఓటు వేసి మన అయిపోయిందని చేతులు దులుపుకోకూడదు.5 ఏళ్లు అవసరం వచ్చిన ప్రతిసారి నాయకుడిని ప్రశ్నించాలి.హామీ నెరవేరకపోతే "పరిస్థితులు అలా ఉన్నాయి" అనే సాకుతో సరిపెట్టుకోకూడదు.గ్రామసభల్లో,టౌన్‌హాల్‌లో ప్రశ్నలు అడగాలి.100% ఓటింగ్ చేసే ఓటరుగా ఉండాలి."వాళ్లందరూ ఒకటే" అని ఇంట్లో కూర్చుంటే మార్పు రాదు.చెడ్డ నాయకులు గెలవడానికి మంచి వాళ్లు ఓటు వేయకపోవడమే కారణం.ఎవరినీ నచ్చకపోతే నోటా కొట్టు,కానీ,ఓటు మాత్రం వేయాలి. డబ్బు,మద్యం,బహుమతులకు అమ్ముడు పోకూడదు.రూ.500 తీసుకుని 5 ఏళ్ల భవిష్యత్తు అమ్ముకోవడం లాంటిది.నువ్వు తీసుకున్న డబ్బు కంటే 100 రెట్లు నీ జేబు నుంచే పన్నుల రూపంలో తీసేస్తారు.ఓటరు అంటే రాజు,రాజు ఎప్పుడూ ఆశతో,కోపంతో నిర్ణయం తీసుకోడు.లెక్కలు వేసుకుని, భవిష్యత్తు చూసుకుని నిర్ణయం తీసుకుంటాడు.నువ్వు ఓటు వేసేటప్పుడు అన్నిటికంటే ముందు ఏ ఒక్క అంశాన్ని చూస్తావనేది నాయకుడిని ఎన్నుకుంటుందని మరిచిపోకూడదు.

## ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్..



హంసకలం వార్త

ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూర్ మండలం మర్లపాడు గ్రామంలోని స్టేట్ పంచాయత్ రాజ్ చాంబెర్ ఫార్మర్ డైరెక్టర్ భీం రెడ్డి పుల్లా రెడ్డి గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఎం. అంజయ్య ఇంటి వరకు సిసి డ్రైయిన్ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పంచాయత్ రాజ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు కొణిజెర్ల మండలం రాజ్యతండా కు చెందిన టి.సునీత, బి.కృష్ణ, సత్యనాగేంద్ర ముగ్గురు కలిపి గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 46/ఊ/2/1/2 లో కొంత భూమి ఉందని, వీటి మార్కెట్ విలువ అధికంగా ఉందని దీనినీ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ రెవెన్యూకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీమ్ టీ హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ నందు ఔట్సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నప్పుడు టర్మినేషన్ పద్ధతిలో విధుల నుండి తొలగించారని తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంఅండ్ హెచ్ఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



హంసకలం వార్త

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి.చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్-ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డి సి పి భాస్కర్, గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ.సి.పి. ప్రకాష్,యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మన దేశం యువ భారతదేశం అని,దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర,దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని,దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం,క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం,యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు.మాదక ద్రవ్యాలు,మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్-ఎస్ టు ఎక్సర్సైజ్"నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవ శ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత,మానసిక ఆందోళనల నుంచి బయ టపడవచ్చు అని, అనారోగ్యం దరి చేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి





-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

హంసకలం వార్త

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య,వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా వాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు.మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, దిగుమతి,హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగాఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల సంబంధిత కరపత్రాలు,గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు,హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్ఫ్లుయెన్సర్/యూట్యూబర్స్తో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ లో భాగంగా గిరిజన గ్రామాలలో రహదారులు,త్రాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగు తుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి





-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి..
-వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణ..
-మున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

హంసకలం వార్త

వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థ వంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది. రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు. ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డిఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఆక్టివిటీలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

-ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా అశ్వారావుపేటలో 2కె రన్ నిర్వహణ..

-యువత క్రీడల్లో రాణించాలి.

-ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

హంసకలం వార్త






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీలో ప్రజా పాలన 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఫిట్ ఆక్టివిటీ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలు, యువత, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, క్రీడాకారులతో కలిసి 2ఖ రన్‌లో పాల్గొన్నారు. పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగిన ఈ రన్ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యం కలిగించింది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో యువత, మహిళలు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు కార్యక్రమ స్థలానికి చేరుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జెండా ఊపి 2ఖ రన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా యువతతో కలిసి పరుగెత్తి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎమ్మెల్యేతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా రన్నింగ్‌లో పాల్గొనడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు కేటాయిస్తున్నారని, శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, నడక, క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకే ప్రభుత్వం ఫిట్ ఆక్టివిటీ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈనెల 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమాల్లో ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజాప్రతినిధులు, అధికారులు చురుకుగా పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా మైదానాలను శుభ్రపరచి యువతకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట క్రీడా పరికరాలు, వాలీబాల్ కోర్టులు, కబడ్డీ మైదానాలు, పరుగుపందెం ట్రాక్‌లు వంటి సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మన అశ్వారావుపేట నియోజకవర్గంలో క్రీడల్లో ప్రతిభ కలిగిన యువత ఎంతో మంది ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా యువత రాణించే అవకాశం ఉందన్నారు. క్రీడలు కేవలం ఆరోగ్యానికే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొంది స్తాయని చెప్పారు. ప్రజా పాలన కార్య క్రమాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవు తోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో అశ్వారావుపేట నియోజకవర్గం రాష్ట్రంలో ఏడవ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. దీనికి కృషి చేస్తున్న అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మక్కువ పెంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మండల అధ్యక్షుడు సున్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్ సైజ్

-పర్యవేక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

-జిల్లా జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు

-ప్రాంతాలలో కొనసాగిన మాక్ డ్రిల్

హంసకలం వార్త

వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా కొనసాగాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి. ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖిల్లా రఘునాథ చెరువు వద్ద రెండు చోట్ల ఏకకాలంలో విపత్తుల నిర్వహణపై మాక్ ఎక్సర్ సైజ్ జరిపారు. రఘునాథ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాలు కురిసి వరద ప్రవాహం కారణంగా చెరువు నీటిలో బాధితులు చిక్కుకున్న సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన తక్షణ చర్యలను వాస్తవిక రూపంలో మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేసి చూపించారు. చెరువులో మునిగిపోతున్న వారిని డ్రోన్ల సహాయంతో గుర్తిస్తూ, బోట్ల ద్వారా ఎస్.డీ.ఆర్.ఎఫ్ సిబ్బంది వారిని కాపాడడం, ఒడ్డుకు చేర్చిన వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స జరిపి అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలించడం వంటి సహాయక చర్యలు అధికార యంత్రాంగం సన్నద్ధతను నిరూ పించాయి. సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, డిచ్పల్లి 7వ పోలీస్ బెటాలియన్ అధికారి సత్యనారాయణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆంజనేయస్వామి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఆర్ అండ్ బీ ఈ.ఈ రంజిత్, శివకుమార్ ఇతర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వరద జలాలు చుట్టుముట్టిన సమయంలో గ్రౌండ్ ఫ్లోర్ లోని పేషెంట్లను హుటాహుటిన పై అంతస్తులకు చేర్చి, వారి ప్రాణాలను ఎలా కాపాడాలి అనే దానిపై మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ఆచరణాత్మక రీతిలో చేసి చూపించారు. నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ తదితరులు పర్యవేక్షించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి



హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఫిషరీస్, హెల్త్, ట్రాన్స్పోర్ట్ తదితర అన్ని శాఖలు చక్కటి సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తూ, ముందస్తుగానే పక్కా పర్యవేక్షణతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఆకస్మిక వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలోనూ వాటిని ధైర్యంగా ఎదుర్కొంటారనే నమ్మకాన్ని మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా కలిగించడం జరిగిందన్నారు. విపత్తుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను విని యోగించుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించు కోవడం జరుగుతుందని, ప్రకృతి వైపరీత్యాలు, కుంభవృష్టి వర్షాలు కురిసిన సమయాలలో సమర్థవంతంగా సేవలు అందించేందుకు మాక్ ఎక్సర్ సైజ్ కార్య క్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

హంసకలం వార్త

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ,నిజామాబాదు జిల్లా శాఖ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్.ఐ.సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ సమాజ సేవలో విశిష్ట పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతర రక్త మార్పిడి సేవలను అందిస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, సేవా సంస్థలు ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే అన్ని శాఖలు తరచుగా రక్తదాన శిబిరాలను నిర్వహించి అవసరమైన రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా సహకరించాలని సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డేటా నమోదు కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. రెడ్ క్రాస్ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కోసం www.redcross.cgg.gov.in వెబ్‌సైట్‌ను వినియో గించుకోవచ్చని తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స అంజనేయులు మాట్లాడుతూ, జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ కార్యకలాపాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు కె. కిరణ్



కుమార్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, డి.ఆర్.డి.ఓ పిడి రెడ్ క్రాస్ సభ్యత్వ నోడల్ ఆఫీసర్ సాయన్న ,సి.ఈ.ఓ జిల్లా సాయ గౌడ్ ,డిప్యూటి లేబర్ కమీషనర్ యాదయ్య ,రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ అబ్బాపూర్ రవి,పలువురు పాల్గొన్నారు.

# ఆ ఇద్దరికీ మంత్రి పదవులు ఖాయం,ఢిల్లీ కీలక మంత్రాంగం

-ఇప్పటికే మంత్రుల పని తీరు పైన హైకమాండ్ కు నివేదిక

-మంత్రివర్గ ప్రక్షాళన పార్టీ పదవులపైన కసరత్తు ఆశావాహులు ఢిల్లీ బాట!

-రేవంత్ ఆలోచన ప్రణాళిక ల మేరకే కేబినెట్ ప్రక్షాళన మంత్రులు అయ్యేదెవరు



హంసకలం వార్త

ఢిల్లీపెద్దలను ప్రసన్నం చేసు కునేందుకు ఆశావహులు లాబీయింగ్! అయిదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కావటంతో తెలంగాణ లో మంత్రివర్గ ప్రక్షాళన పార్టీ పదవుల పైన కసరత్తు జరుగుతోంది. దీంతో, పలువురు ఆశావాహులు ఢిల్లీ బాట పడుతున్నారు. మంత్రి పదవుల కోసం లాబీయింగ్ జరుగుతోంది. కాగా ప్రస్తుత కేబినెట్ లో ఇద్దరి పదవులు కోల్పోవటం ఖాయమని తెలుస్తోంది. అదే విధంగా ముగ్గురికి కొత్తగా ఛాన్స్ దక్కనుంది. దీంతో కేబినెట్ లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఇప్పుడు పార్టీలోఆసక్తిని పెంచుతోంది తెలంగాణలో మంత్రివర్గ ప్రక్షాళన దిశగా కసరత్తు మొదలైంది. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి కావస్తుండటం, క్యాబినెట్‌లో మూడు ఖాళీలు ఉండటం తో ఈసారి ఎలాగైనా మంత్రి పదవి దక్కించుకోవాలని ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాలతో పాటు, పనితీరు ఆధారంగా కొందరిని మార్చే అవకాశం ఉందన్న ప్రచారం తో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.సీనియర్ ఎమ్మెల్యే లతో పాటు సామాజిక, ప్రాంతీయ సమీకరణాల రీత్యా అవకాశం వస్తుందని భావిస్తున్న నేతలు ఇప్పటికే ఢిల్లీలో మకాం వేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిశారు. ఈ విషయం తెలిసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హుటాహుటిన సాయంత్రమే ఢిల్లీకి చేరుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తనకే అవకాశం కల్పించాలని గతంలో విన్నవించిన ఆయన మరోసారి తన ప్రయత్నాల ను ముమ్మరం చేసేందుకు హస్తిన బాట పట్టారు. వీరిద్దరితో పాటు మరికొందరు ఆశావహులు కొంతకాలంగా ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు లాబీయింగ్ మొదలుపెట్టారు ఢిల్లీ పెద్దలను

**-ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు లాబీయింగ్**

కాగా, ఇప్పటికే మంత్రుల పని తీరు పైన హైకమాండ్ కు నివేదిక అందాయి. బీసీ వర్గం నుంచి డిప్యూటీ సీఎంగా అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన పైన హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోనుంది. ఇక ప్రస్తుత కేబినెట్ లో ఒక మహిళా మంత్రితో పాటుగా మరో ఇద్దరు మంత్రులు పదవుల్లో కొనసాగటం పైనా చర్చలు సాగుతున్నాయి. అదే విధంగా కోదండరాం, విజయశాంతికి అవకాశం పైనా అంచనాలు వినిపిస్తున్నాయి. అదే విధంగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ను కేబినెట్ లోకి తీసుకొని పొన్నంకు పీసీసీ పగ్గాలు ఇస్తారనే ప్రచారమూ సాగింది.

**-రేవంత్ ఆలోచన ప్రణాళిక ల మేరకే కేబినెట్ ప్రక్షాళన?**

అయితే, ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచనలు ప్రణాళికల మేరకే కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని చెబుతున్నారు. ఈ నెలాఖరు లోగా మంత్రివర్గ ప్రక్షాళన పార్టీ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేసి జూన్ 2న కొత్త పథకాలు హామీల అమలుతో పాలన వేగవంతం చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. దీంతో కేబినెట్ లో ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# రానున్న రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ భూస్థాపితమే ఎంపీ అరవింద్ జోస్యం

హంసకలం వార్త




నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ అడ్డంకిగా మారిందని నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల సమయం లో నిజామాబాద్ కు ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ బీజేపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై మండి పడ్డారు. 2034 వరకు సీఎం గా ఉంటానని చెప్పే రేవంత్ పచ్చి అబద్ధాల కోరు అన్నారు. 2039 లో రాహుల్ ను ప్రధాని చేస్తానని చెప్పడం చూస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ఉనికి ప్రశ్నార్థకం అని తేలింది అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాకు పంగనామాలు పెట్టిండనీ ఎన్నికల సమయం లో అబద్ధపు హామీలు ఇవ్వడం తప్ప వాటిని అమలు పరచడం లో విఫలం అయ్యారని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ని రాజకీయంగా అణగదొక్కేందుకు రేవంత్ కుట్ర పన్నుతు జిల్లాకు మొండిచేయి చూపాలన్నారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వ సలహాదారులు,రూరల్ ఎమ్మెల్యే ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని నిలదీశారు. ఇచ్చిన మాట ప్రకారం ఔటర్ రింగ్ రోడ్డు మంజూరు చేయని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ మొఖం పెట్టుకుని జిల్లాలో తిరుగుతున్నాడు అని నిలదీశారు. నిజామాబాద్ కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తా అని హామీ ఇచ్చి ఇందూరు ప్రజలను మోసం చేస్తే ఇక్కడి ప్రజలు బుద్ధి చెప్తారనీ జోస్యం చెప్పారు. అన్ని విషయాల్లో కాంగ్రెస్ ఇదే విధానాన్ని అవలంబిస్తుందని పేర్కొన్నారు. దేవుళ్ళను మోసం చేసినోడికి ప్రజలను మోసం చేయటం లెక్కకాదన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో మొదలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికావన్నారు. ఇప్పటివరకు కనీసం 25 శాతం పనులు కూడా పూర్తికాలేదనీ లెక్కలతో సహా వివరించారు. 162 కోట్లకు గాను కేవలం 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసి కి ప్రభుత్వం కేటాయించిందన్నారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారు అని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని తెలిపారు. రాహుల్ ఇక ప్రధాని కాలేరు ,ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటదని ఒప్పుకున్నారన్నారు. రేవంత్ రెడ్డిని కి బదులు కోమటి రెడ్డి లాంటి జన్యూన్ పర్సన్ ని ముఖ్యమంత్రిగా నియమించండనీ సూచించారు. బుల్లెట్ రైల్ కారిడో విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారనీ ధ్వజమెత్తారు. ఉన్నపట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తా అన్న కెసిఆర్ నే ప్రజలు నమ్మలేదు,ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా అని సెంటర్లు వేశారు. ఈ .ఇండియా సమావేశం లో పసుపు బోర్డ్ చైర్మెన్ పల్లె గంగారెడ్డి,జిల్లా అధ్యక్షులు దినేష్ ,అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

# బిజినెస్

## కారులో ఉండే ఈ బటన్‌ను చాలా మంది సరిగా ఉపయోగించరు.. ఎప్పుడు వాడాలో చూద్దాం..!




కార్ల డ్యాష్‌బోర్డ్ పై కారు గుర్తు లోపల వంపు తిరిగిన బాణం ఆకారంలో ఒక బటన్ ఉంటుంది.దీన్ని 'ఎయిర్ రీసర్క్యులేషన్' బటన్ అంటారు. చాలామందికి దీని గురించి తెలియక పట్టించుకోరు. కొందరేమో ఎప్పుడూ దీన్ని ఆన్‌లోనే ఉంచుతారు. కానీ దీన్ని సరైన పద్ధతిలో వాడితే... ఏసీ ఆన్ చేసినప్పుడు కారు వేగంగా చల్లబడుతుంది. మైలేజ్ పెరుగుతుంది. బయటి కాలుష్యం లోపలికి రాకుండా ఉంటుంది. దీన్ని ఎప్పుడు ఆన్ చేయాలి? ఎప్పుడు ఆఫ్ చేయాలో చూద్దాం..! వేసవికాలంలో ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు ఈ బటన్‌ను కచ్చితంగా ఆన్ చేసుకోవాలి. ఇది నొక్కినప్పుడు బయటి వేడి గాలి లోపలికి రాకుండా కారు లోపల ఉండే ఫ్లాప్స్ మూసుకుపోతాయి. ఏసీ సిస్టమ్ లోపల అప్పటికే చల్లబడిన గాలినే మళ్లీ మళ్లీ సర్క్యులేట్ చేస్తూ క్యాబిన్‌ను త్వరగా కూల్ చేస్తుంది. దీనివల్ల ఏసీ కంప్రెసర్ పై భారం తగ్గి ఇంధనం ఆదా అవుతుంది. అలాగే ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు ముందు వాహనాల నుంచి వచ్చే డీజిల్ పొగ, దుమ్ము, రోడ్డు పై వచ్చే దుర్వాసనలు కారు లోపలికి రాకుండా ఈ బటన్ అడ్డుకుంటుంది.

**ఆ టైమ్ లో మాత్రం అస్సలు ఆన్ చేయొద్దు!**

అయితే చలికాలంలో లేదా వర్షం పడేటప్పుడు ఈ బటన్‌ను అస్సలు ఆన్ చేయొద్దు. ఈ సమయంలో కారు లోపల ఉన్నవారి శ్వాస వల్ల, తడి దుస్తుల వల్ల క్యాబిన్ లోపల తేమ పెరిగిపోతుంది. ఈ బటన్ ఆన్‌లో ఉంటే ఆ తేమ బయటకు పోలేక విండ్‌షీల్డ్, కిటికీ అద్దాలపై పొగమంచులా పేరుకుపోయి దారి కనిపించకుండా పోతుంది. అద్దాలు ఇలా మసకబారినప్పుడు వెంటనే ఈ బటన్‌ను ఆఫ్ చేసి 'ఫ్రెష్ ఎయిర్ మోడ్' ఆన్ చేయాలి. అలాగే, కారులో ఎక్కువ మంది ప్రయాణిస్తున్నప్పుడు ఆక్సిజన్ తగ్గి నిద్రమత్తు రాకుండా ఉండటానికి అప్పుడప్పుడు దీనిని ఆఫ్ చేసి బయటి గాలిని లోపలికి రానివ్వాలి.

# హెచ్‌డీఎఫ్‌సీని వెనక్కి నెట్టిన ఎయిర్‌టెల్..

# రెండో అత్యంత విలువైన కంపెనీగా రికార్డు




టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టింది. దీంతో దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడటంతో ఈ ఘనత సాధ్యమైంది. ఓ దశలో ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ఏకంగా రూ.11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం దేశంలో రూ.18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది. గత వారం రోజుల్లో ఎయిర్‌టెల్ షేర్లు 10 శాతం మేర లాభపడ్డాయి. కానీ ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం మేర పతనమవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామా చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన ప్రదర్శన కనబర్చింది. ఈ బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ.1,912 కోట్లకు చేరింది. బ్యాంక్ నికర ఆదాయం కూడా 3.2 శాతం వృద్ధితో రూ.3,380 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులు 1.15 శాతంతో స్థిరంగా ఉన్నాయి. మరోవైపు టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం ఈ త్రైమాసికంలో 34 శాతం తగ్గింది. ఈ క్వార్టర్‌లో ఎయిర్‌టెల్ రూ.7,325 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో కంపెనీకి రూ.11,021 కోట్ల లాభం వచ్చింది. గత ఏడాది లాభాల్లో రూ.2,892 కోట్ల పన్ను మినహాయింపు కలిసి రావడమే ఈ వ్యత్యాసానికి కారణమని ఎయిర్‌టెల్ పేర్కొంది.

## రిటైర్ అయ్యాక కూడా ఎన్‌పీఎస్ డబ్బుల పై లాభాలు.. కొత్త పెన్షన్ రూల్స్ తెచ్చిన కేంద్రం!



రిటైర్ అయ్యాక చేతికి వచ్చే పెన్షన్ డబ్బులను ఒకేసారి కాకుండా విడతల వారీగా పొందుతూ.. మిగిలిన సొమ్ముపై లాభాలు ఆర్జించే సరికొత్త అవకాశాన్ని 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పీఎస్) తీసుకొచ్చింది. 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఎఫ్ఆర్‌డీఏ) 2026 జారీ చేసిన తాజా సర్క్యులర్ ప్రకారం.. రిటైర్మెంట్ ఇన్‌కమ్ స్కీమ్స్ (ఆర్ఐఎస్), డ్రాడౌన్ ఆప్షన్లను కొత్తగా ప్రవేశపెట్టింది. రిటైర్మెంట్ తర్వాత కూడా డబ్బులు త్వరగా అయిపోకుండా మార్కెట్ లింక్డ్ లాభాలతో పాటు నెలనెలా స్థిరమైన ఆదాయం అందించడమే ఈ కొత్త విధానం ఉద్దేశం.

**ఇప్పటివరకు ఉన్న నియమం**

ఇప్పటివరకు ఉన్న రూల్స్ ప్రకారం.. ఎన్‌పీఎస్ చందాదారులు రిటైర్ అయినప్పుడు తమ మొత్తం కార్పస్‌లో గరిష్ఠంగా 60 శాతాన్ని ఒకేసారి ట్యాక్స్ లేకుండా విత్ డ్రా చేసుకునే అవకాశం ఉండేది. మిగిలిన 40 శాతం సొమ్ముతో కచ్చితంగా 'యాన్యుటీ' కొనుగోలు చేయాలి. దీని ద్వారానే వారికి నెలవారీ పెన్షన్ వచ్చేది. అయితే ఒకేసారి చేతికి వచ్చే 60 శాతం మొత్తాన్ని ఎలా మేనేజ్ చేసుకోవాలో తెలియక చాలామంది ఇబ్బంది పడేవారు.

**కొత్త మార్పు**

కొత్త నిబంధనల ప్రకారం.. రిటైర్మెంట్ తర్వాత ఒకేసారి 60 శాతం సొమ్మును తీసేసుకోకుండా, దానిని ఎన్‌పీఎస్‌లోనే ఉంచి విడతల వారీగా విత్ డ్రా చేసుకోవచ్చు. ఇది మ్యూచువల్ ఫండ్స్‌లోని సిస్టమేటిక్ విత్‌డ్రా ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ)లాగా పనిచేస్తుంది. దీనివల్ల సాధారణ పెన్షన్‌తో పాటు అదనంగా క్రమం తప్పకుండా డబ్బు చేతికి అందుతుంది. అయితే 40 శాతం యాన్యుటీ కొనుగోలు నిబంధనలో మాత్రం ఎలాంటి మార్పూ ఉండదు. అలాగే ఈ డబ్బు మార్కెట్లో పెట్టుబడిగా ఉంటుంది గనక ప్రతిసారీ ఒకే రకమైన ఫిక్స్‌డ్ అమౌంట్ వస్తుందనే గ్యారెంటీ ఉండదు.

# ఒకరు మెచ్చారు.. మరొకరు హెచ్చరించారు..

# వైభవ్ పై భజ్జీ, కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- భారత జట్టుకు ఆడాలంటే వైభవ్ ఫీల్డింగ్ మెరుగుపరుచుకోవాలన్న కైఫ్
- ఢిల్లీతో మ్యాచ్‌లో మిస్‌ఫీల్డింగ్‌తో రన్స్ ఇచ్చాడని విమర్శ
- వైభవ్ బ్యాటింగ్ అద్భుతమని, క్రిస్ గేల్ కంటే ప్రమాదకరమన్న భజ్జీ
- యువ ఆటగాడి ప్రతిభపై భిన్నంగా స్పందించిన భారత మాజీ క్రికెటర్లు




యువ సంచలనం, రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్లు భిన్నరీతిలో స్పందించారు. బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నా, ఫీల్డింగ్‌లో చాలా మెరుగుపడాల్సి ఉందని మహమ్మద్ కైఫ్ హెచ్చరించగా, అతని బ్యాటింగ్ శైలిని హర్భజన్ సింగ్ ఆకాశానికెత్తాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ ఓటమి అనంతరం వీరిద్దరూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించాడు. ఈ సందర్భంగా మహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. వైభవ్ భారత జట్టుకు ఆడాలంటే తన ఫీల్డింగ్ నైపుణ్యాలను తప్పనిసరిగా మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేశాడు. "ఆటగాళ్లను ఎంపిక చేసే స్కౌట్లు ఫీల్డింగ్ టెస్టు కూడా నిర్వహించాలి. వైభవ్ ఒక్క క్యాచ్ కూడా పట్టినట్టు నేను చూడలేదు. ఢిల్లీతో మ్యాచ్‌లో ఒక బంతి మంచి ఎత్తులో అతని వద్దకు వచ్చింది. ఆ క్యాచ్ పట్టడానికి అతను సరైన పొజిషన్‌లో ఉన్నప్పటికీ, అనవసరంగా గాల్లోకి ఎగిరి జారవిడిచాడు. బ్యాటింగ్‌లో అతను చాలా ప్రతిభావంతుడు, కానీ ఫీల్డింగ్ విషయంలో అతను ఇంకా సిద్ధంగా లేడు" అని కైఫ్ విశ్లేషించాడు. మరోవైపు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ మాత్రం వైభవ్ బ్యాటింగ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్‌ను ఎదుర్కోవడం ఏ బౌలర్‌కైనా సవాల్ అని అన్నాడు. "వైభవ్‌కు బౌలింగ్ చేయాల్సి వస్తే, ఎలాగైనా అతని వికెట్ తీయాలనే ప్లాన్‌తో వెళతా. కానీ, అతను ఉన్న ఫామ్‌కు అది కష్టమే. అతని హిట్టింగ్ ఆర్క్‌కు దూరంగా బంతిని స్పిన్ చేయడమే నా వ్యూహం. నేను ఎంతో మంది ఆటగాళ్లతో ఆడాను. క్రిస్ గేల్ వికెట్‌ను కూడా చాలాసార్లు తీశాను. కానీ, వైభవ్ ఒక డిఫరెంట్ లెవెల్. 15 ఏళ్ల వయసులో ప్రతి బౌలర్‌ను సిక్సర్లు కొట్టడం మామూలు విషయం కాదు" అని భజ్జీ కొనియాడాడు. మొత్తం మీద బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ సూర్యవంశీ, ఫీల్డింగ్‌లో కూడా రాణిస్తేనే జాతీయ జట్టులో స్థానం సులభమవుతుందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కోచ్ గంభీర్ చేతిలో సూర్యకుమార్ భవితవ్యం




భారత టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తు పై త్వరలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గువాహటిలో మంగళవారం బీసీసీఐ సెలక్షన్ కమిటీ సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చే సలహాలు చాలా కీలకం కానున్నాయని క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది. బోర్డు సెక్రటరీ దేవాజిత్ సైకియా కూడా ఈ చర్చలో పాల్గొనున్నారు. ఈ మధ్య సూర్యకుమార్ ఫామ్ ఆందోళన కలిగిస్తున్న విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026లో కూడా ముంబై ఇండియన్స్ తరఫున అతడు సరిగ్గా ఆడడం లేదు. అందుకే అతని కెప్టెన్సీపై సెలక్టర్లు చర్చించనున్నట్లు సమాచారం. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల కోసం కొత్త కెప్టెన్సీ ప్లాన్ గురించి మాట్లాడనున్నారని తెలుస్తోంది. సూర్య నాయకత్వంలో భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత జరుగుతున్న మొదటి సమావేశం ఇదే.

# స్పోర్ట్స్

## పాపం.. పాంటింగ్.. ఆ ఫొటో చూస్తుంటే భావోద్వేగంగా ఉంది




ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రస్థానం దాదాపు ముగిసినట్టే. ఆదివారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఓటమితో ఆ జట్టు వరుసగా ఆరో పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ ఓటమితో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమణ అంచున నిలిచింది. మ్యాచ్ అనంతరం డగౌట్‌లో హెడ్ కోచ్, దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ ఒంటరిగా, తీవ్ర నిరాశతో కూర్చున్న దృశ్యం అందరినీ కదిలించింది. ఈ ఫొటోపై టీమిండియా వెటరన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించాడు. పాంటింగ్ ఒంటరిగా కూర్చున్న చిత్రం ఎంతో భావోద్వేగంతో కూడుకున్నదని, పంజాబ్ పరిస్థితికి ఫ్రాంచైజీ యాజమాన్యమే కారణమని తీవ్ర విమర్శించాడు. జట్టు ప్రయోజనాలను పక్కనపెట్టి, రెండు వేర్వేరు హోం గ్రౌండ్‌లలో ఆడాలన్న ఫ్రాంచైజీ నిర్ణయమే కొంపముంచిందని స్పష్టం చేశాడు. అశ్విన్ మాట్లాడుతూ.. "ఈ టోర్నీలో టాప్-2లో నిలవాల్సిన జట్టు ఇలాంటి స్థితికి రావడం బాధాకరం. నేను 2018లో ఇదే కుర్చీలో కూర్చున్నాను. ఛాంపియన్ జట్లేవీ రెండు, మూడు హోం గ్రౌండ్‌లలో ఆడవు. మొహాలీలో వరుసగా గెలిచి, మంచి ఊపు మీదున్న సమయంలో ధర్మశాలకు వచ్చి వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడిపోయారు. వారి ఓటమికి వారే కారణం" అని అన్నాడు. "మొహాలీ, ధర్మశాల పిచ్‌లకు పేస్, బౌన్స్ విషయంలో చాలా తేడా ఉంది. ఎత్తులో తేడా ఉండటంతో పిచ్ భిన్నంగా ప్రవర్తిస్తుంది. దీనివల్ల యువ ఆటగాళ్లు, విదేశీ ఆటగాళ్లు కూడా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. క్రికెట్ అవసరాల కన్నా వ్యాపార ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ధర్మశాలలో ఒక్క మ్యాచ్ గెలిచినా ఇప్పుడు వారి పరిస్థితి వేరేలా ఉండేది. ఈ పరిస్థితికి రికీ పాంటింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఎంతో బాధపడతారు. కానీ, గెలవాలనుకుంటే సొంత మైదానాన్ని వదిలి ఇలాంటి తప్పులు చేయకూడదు" అని అశ్విన్ ఘాటుగా వ్యాఖ్యానించాడు. కాగా, పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ చివరి మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

# 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది..

## థియేటర్లలో మెగా జాతర ఖాయం!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు ముంబయి వేదికగా గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో మెగా జాతర ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ మేకోవర్, ఆయన నటన, డైలాగ్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాను దర్శకుడు బుచ్చిబాబు ఎంత ఎమోషనల్‌గా తెరకెక్కించారో ట్రైలర్ స్పష్టం చేస్తోంది. చరణ్ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదగడం గమనించొచ్చు. ఏఆర్ రెహ్మాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు విజువల్స్ ట్రైలర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. రామ్‌చరణ్ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..." ఈ డైలాగ్ సినిమాలోని చరణ్ క్యారెక్టర్ తీవ్రతను, పోరాటాన్ని తెలియజేస్తోంది. "మాటలతో కాదు.. ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను" అనే డైలాగ్ మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. మొత్తంగా 'పెద్ది' ట్రైలర్ సినిమాపై అంచనాలను ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మనసుకు హత్తుకునే ఎమోషన్స్ ఉన్న పక్కా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మెటీరియల్‌లా ఇది కనిపిస్తోంది. జూన్ 4న థియేటర్లలో చరణ్ బాక్సాఫీస్ వేట ఎలా ఉండబోతుందో చూడాలి! వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ రాజ్ కుమార్, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, దివ్యేందు శర్మ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## ఒంటరిగా ఉండేందుకు కూడా సిద్ధమే



బాలీవుడ్ యంగ్ హీరోయిన్ సారా అలీ ఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'పతి పత్నీ ఔర్ వో దో' ఇటీవల మే 15న విడుదలై, బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. నేటితరం ప్రేమకథలు, ఆధునిక వైవాహిక బంధాల్లో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను ఈ సినిమాలో ఎంతో ఆసక్తికరంగా చూపించడంతో ప్రేక్షకులకు ఇది బాగా కనెక్ట్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సారా అలీ ఖాన్ పెళ్లి బంధంపై తనకున్న ప్రాక్టికల్ ఆలోచనలను, తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు. తన వ్యక్తిగత జీవితంలో, చుట్టుపక్కల కొన్ని పెళ్లి బంధాలు విఫలమై విడిపోవడాన్ని కళ్లారా చూసిన సారా, వివాహం అనే వ్యవస్థను కేవలం ఊహల్లో చూసి తేలిపోనని స్పష్టం చేశారు. మనం పెరిగిన వాతావరణం, మన చుట్టూ చూసే సంఘటనల నుంచే మన ఆలోచనలు పుడతాయని పేర్కొంటూ, హడావుడిగా పెళ్లి చేసుకుని బాధపడే కంటే కాస్త సమయం తీసుకుని సరైన వ్యక్తి దొరికే వరకు వేచి చూడటం ఎంతో ఉత్తమమని ఆమె అభిప్రాయపడ్డారు. ఒకవేళ తన జీవితంలోకి సరైన భాగస్వామి దొరకకపోతే, ఎవరికోసం తనను తాను మార్చుకోకుండా జీవితాంతం ఒంటరిగా ఉండటానికైనా సిద్ధమేనని సారా తేగేసి చెప్పారు. నన్ను ఎవరో వచ్చి సంపూర్ణురాలిగా చేయాల్సిన అవసరం లేదని, ఒక సంపూర్ణమైన మనిషిగా సొంతంగా ఎదగడానికే తాను ప్రాధాన్యత ఇస్తానని సారా ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకంటూ ఉన్న ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూ, తన సంతోషాన్ని పంచుకునే వ్యక్తి దొరికినప్పుడే పెళ్లి గురించి ఆలోచిస్తానని చెబుతూ, ప్రస్తుతానికి మాత్రం తన పూర్తి దృష్టి కేవలం కెరీర్, సొంత ఎదుగుదల, సినిమాలపైనే ఉందని ఆమె క్లారిటీ ఇచ్చారు.

## రాత్రి 11.52 గంటలకు 'డ్రాగన్' గ్లింప్స్.. అధికారికంగా ప్రకటించిన మేకర్స్




యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న పేరు) నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల సుదీర్ఘ నిడివితో ఈ గ్లింప్స్ ఉండబోతుండటం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 'డ్రాగన్' రాత్రి 11:52 గంటలకు ఈ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో కూడా ఈ వీడియోను ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఈ భారీ గ్లింప్స్‌కు సెన్సార్ బోర్డు నుంచి U/A 16 రేటింగ్‌తో ధ్రువీకరణ పత్రం కూడా లభించింది. "విధ్వంసం మరో రేంజ్‌లో ఉంటుంది" అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ అంచనాలను మరింత పెంచేసింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి భారీ చిత్రాల తర్వాత ఎన్టీఆర్ నుంచి వస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రశాంత్ నీల్ దర్శకుడు కావడంతో 'డ్రాగన్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు ఫస్ట్ లుక్ కూడా విడుదల కాకపోవడంతో నిరాశలో ఉన్న అభిమానుల ఆకలి తీర్చేలా ఈ భారీ గ్లింప్స్ ఉండబోతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.


## టాక్సిక్ సినిమా ఆలస్యం పై నోరు విప్పిన యశ్



హీరో యశ్ తన కొత్త సినిమా 'టాక్సిక్' ఆలస్యం పై నోరు విప్పారు. ఈ చిత్రాన్ని గ్లోబల్ లెవెల్లో ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు. అందుకే విడుదల తేదీని వాయిదా వేయాల్సి వచ్చిందని వెల్లడించారు. గీతూ మోహన్ దాస్ ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. టాక్సిక్ సినిమా జూన్ 4న విడుదల కావాల్సింది. కానీ ఈ ప్రాజెక్ట్‌ను మరింత పెద్దగా మార్చాలని నిర్ణయించారు. దీనివల్ల అభిమానులు నిరాశ చెందుతారని యశ్ అంగీకరించారు. భారత్‌లో షూటింగ్ మొదలవగానే విడుదలపై అంచనాలు ఉంటాయని అన్నారు. కానీ తన విజన్ మాత్రం చాలా పెద్దదని చెప్పారు. భారత్‌లో సినిమా ప్రకటించగానే మార్కెటింగ్ మొదలవుతుందని యశ్ అన్నారు. కానీ హాలీవుడ్‌లో సినిమా పూర్తయ్యాకే వ్యాపారం జరుగుతుందని చెప్పారు. అక్కడ పెట్టుబడిదారులు మొత్తం సినిమా చూశాకే నిర్ణయం తీసుకుంటారన్నారు. టాక్సిక్ సినిమాను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకే కొంచెం సమయం పడుతుందని, ఫ్యాన్స్ అర్థం చేసుకోవాలని కోరారు.

## సల్మాన్ షర్ట్‌లెస్ ఫొటోకు ఫ్యాన్స్ ఫిదా... ఆ క్యాప్షన్ ఆంతర్యమేంటి

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ సోషల్ మీడియాలో ఎప్పుడు యాక్టివ్‌గా ఉంటారు. తన సినిమాల అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత విషయాలను కూడా పంచుకుంటూ అభిమానులను అలరిస్తుంటారు. తాజాగా ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. తనదైన శైలిలో షర్ట్‌లెస్ ఫొటోను షేర్ చేసిన సల్మాన్, దానికి జత చేసిన తాత్వికమైన క్యాప్షన్ అందరినీ ఆలోచింపజేస్తోంది. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్‌గా మారింది. డిమ్ లైటింగ్‌లో ఉన్న గదిలో సోఫాపై పడుకుని ఉన్న షర్ట్‌లెస్ ఫొటోను పంచుకున్న సల్మాన్ ఖాన్, తన ఫిట్‌నెస్‌ను మరోసారి ప్రదర్శించారు. అయితే, ఈసారి అందరి దృష్టిని ఆకర్షించింది ఆయన రాసిన క్యాప్షన్. "ఒంటరిగా ఉండటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి 'అలోన్' (ఖాత్రీశీఅవ), రెండోది 'లోన్లీ' (ఖాశీఅవశ్రీఎ). 'అలోన్'గా ఉండటం అనేది మన ఇష్టపూర్వక ఎంపిక. కానీ, ఎవరూ మనతో ఉండటానికి ఇష్టపడనప్పుడు వచ్చేది 'లోన్లీ'నెస్... ఇక దీని తర్వాత ఏం చేయాలో మీరే ఆలోచించుకోండి" అంటూ ఆయన రాసుకొచ్చారు. ఈ క్రిప్టిక్ పోస్ట్ వెనుక ఆంతర్యం ఏంటని అభిమానులు, నెటిజన్లు చర్చించుకుంటున్నారు. సల్మాన్ పోస్ట్‌పై సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి పెద్ద ఎత్తున స్పందనలు వస్తున్నాయి. 2005లో ఆయనతో 'లక్కీ' చిత్రంలో నటించిన హీరోయిన్ స్నేహా ఉల్లాల్ స్పందిస్తూ, "ఓరి దేవుడా ఆది... 'లక్కీ' సినిమా టైమ్‌లో ఇవన్నీ ఎందుకు చేయలేదు?" అని సరదాగా కామెంట్ చేశారు. ఆ చిత్రంలో సల్మాన్ పాత్ర పేరు ఆదిత్య శ్రేఖ్ (ఆది). ఇక, సల్మాన్ సన్నిహితురాలు ఇలియా వంతూర్ ఫైర్ ఎమోజీలతో తన స్పందనను తెలియజేసింది. వీరితో పాటు కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా, నటులు వత్సల్ సేత్, అనితా హస్సానందాని కూడా ఫైర్ ఎమోజీలను పోస్ట్ చేశారు. "వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమే", "ఇక మాకు నిద్ర ఎలా వస్తుంది?" అంటూ అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సల్మాన్, తాను తన జీవితంలో ఇప్పటివరకు ఏ స్క్రిప్టునూ పూర్తిగా చదవలేదని, కేవలం కథను వింటానని చెప్పడం గమనార్హం. 'రాజా శివాజీ' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన సల్మాన్, త్వరలో 'మాతృభూమి' అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449